ప్రజా విశ్వంభర V3 NEWS



## రజినీకాంత్ ధర్మన్‌లోకి లేడీ సూపర్ స్టార్ ఎంట్రీ

సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో ఫుల్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన 'జైలర్-2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ 'జైలర్-2' కూడా ప్రజెంట్ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుని ప్రశంసలు అందుకుంటుంది. ప్రజెంట్ ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న రజినీకాంత్.. త్వరలో 'ధర్మన్'తో రాబోతున్నాడు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని కమల్ హాసన్ తన సొంత బ్యానర్ అయిన 'రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్‌తో భారీ హైప్ క్రియేట్ కాగా.. తాజాగా మరో క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో రామ్ పోతినేని విలన్ పాత్రలో నటిస్తుండగా.. రాశీ ఖన్నా, రుక్మిణి వసంత్, శ్రీలీల, సిమ్రాన్ వంటి హీరోయిన్స్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పుడు ఈ బృందంలోకి లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా చేరినట్లు తెలుస్తోంది. ఇందులో ఒక కీలక పాత్ర కోసం నయనతారను సంప్రదించగా.. ఆమె అంగీకరించినట్లు సమాచారం. కథలో ఆమె పాత్ర చాలా ముఖ్యమైనదని, సినిమాలోని అనేక సన్నివేశాల్లో ఆమె కనిపిస్తారని తెలుస్తుండగా.. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.

## ఆ హీరోతో పిచ్చిగా ప్రేమలో ఉన్నా

బాలీవుడ్ సినిమాలు, అందులోని రొమాంటిక్ హీరోల ప్రభావం తనపై ఎంతగా ఉందో నటి మృణాల్ ఠాకూర్ తాజాగా పంచుకున్నారు. ముఖ్యంగా తెరపై కింగ్ ఖాన్ షారుక్ ఖాన్ పోషించిన రొమాంటిక్ పాత్రలు ప్రేమ పట్ల తన అంచనాలను పెంచేశాయని ఆమె తెలిపారు. తన జీవితంలో షారుక్ ఖాన్ లేకపోవడం ఎలానో ఉందంటూ సరదాగా వ్యాఖ్యానించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మృణాల్.. పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ''నా జీవితంలో షారుక్ ఖాన్ లేడనే విషయం మనసును ముక్కలు చేస్తోంది. రొమాన్స్ విషయంలో ఆయన క్రియేట్ చేసిన బెంచ్‌మార్క్ గురించి ఎంత చెప్పినా తక్కువే. నాకు షారుక్ సర్ అంటే పిచ్చి ప్రేమ. స్క్రీన్‌పై ఆయన చేసిన పాత్రలంటే చాలా ఇష్టం. షారుక్‌లా రొమాంటిక్‌గా ఉండే వ్యక్తిని నేను ఇప్పటిదాకా కలవలేదు'' అని ఆమె చెప్పుకొచ్చారు. గతంలో సినిమాల్లో చూపించిన రొమాన్స్‌కు, ప్రస్తుత కాలానికి ఉన్న తేడాల గురించి కూడా మృణాల్ మాట్లాడారు. ''నేను పాత ఐకానిక్ సినిమాలను మళ్లీ చూసినప్పుడు.. కొన్ని విషయాలు చూసి 'ఏంటిది.. ఎందుకు ఇలా తీశారు' అనిపిస్తుంది. అయితే, ఆ కాలం వేరు. అప్పట్లో సోషల్ మీడియా లేదు, కేవలం వినోదం కోసమే సినిమాలు చూసేవారు. కానీ, ఇప్పుడు అంతా మారింది. ఏ విషయంలోనైనా మహిళలకు కొన్ని ఎంపికలు చేసుకునే అవకాశాలున్నాయి. ఇలాంటి కాలంలో పుట్టినందుకు సంతోషంగా ఉంది. ఒక సినిమా నుంచి కొందరు గుణపాఠం నేర్చుకుంటారు. మరికొందరు కేవలం వినోదంగా మాత్రమే చూస్తారు. మూవీ చూసిన తర్వాత కూడా కొందరిలో మార్పు రాదు. ఇదంతా ప్రేక్షకులు సినిమాను అర్థం చేసుకునే కోణంపై ఆధారపడి ఉంటుంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక సినిమాల విషయానికొస్తే.. మృణాల్ ఠాకూర్ ఇటీవల క్రైమ్ థ్రిల్లర్ 'పూజా మేరీ జాన్' చిత్రంలో నటించారు. హ్యూమా ఖురేషి, విజయ్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



## యూట్యూబ్ సెన్సేషన్ అజయ్ హీరోగా కొత్త సినిమా

యూట్యూబ్ సెన్సేషన్, 'ఏయ్ జూడ్'గా పాపులర్ అయిన అజయ్ హీరోగా తెరకెక్కనున్న కొత్త సినిమా నేడు అధికారికంగా ప్రారంభమైంది. రాము కొప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నెక్సస్ సినిమాస్, స్కైబ్లేజ్ సిల్వర్ స్క్రీన్ బ్యానర్లపై నెక్సస్ శ్రీధర్, దీపక్ ముస్త్యాల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, ఫహాద్ అబ్దుల్ మజీద్ సినిమాటోగ్రాఫర్‌గా, క్రాంతి ప్రియమ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. రామానాయుడు స్టూడియోస్‌లో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. ఈ వేడుకకు చిత్ర బృందంతో పాటు పలువురు సినీ ప్రముఖులు, ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. ప్రముఖ దర్శకుడు బి. గోపాల్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకుడు హరీష్ శంకర్ తొలి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు.



### ఆ విషయంలో

## ప్రేక్షకులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు: నాగవంశీ

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో నిర్మాత, నాగవంశీ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సినిమా వసూళ్లు, టికెట్ రేట్ల గురించి పలు ఆసక్తికర విషయాలను ఆయన పంచుకున్నారు. ''దర్శకుడు నెల్సన్, రజనీకాంత్‌పై ఉన్న నమ్మకంతోనే 'జైలర్ 2' హక్కులను కొనుగోలు చేశాం. ఆ రిస్క్ ఇప్పుడు మంచి ఫలితాన్ని ఇచ్చింది. ప్రస్తుతం డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు రావడం చాలా అరుదు. కానీ 'జైలర్ 2' మాత్రం వారికి మంచి కమీషన్లు తెచ్చిపెడుతోంది. ఆంధ్రాలో ప్రతి షోకి వసూళ్లు పెరుగుతున్నాయి. వైజాగ్ లాంటి ప్రాంతాల్లో కలెక్షన్లు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి. ఈ విజయదశమి నాటికి నైజాంలో బ్రేక్ ఈవెన్ పూర్తవుతుంది'' అని



ఆశాభావం వ్యక్తం చేశారు. ''ఈ సినిమా విజయానికి కంటెంటే ప్రధాన కారణం. ప్రీ రిలీజ్ ఈవెంట్ లాంటివి చేయకపోయినా జనాలు థియేటర్లకు క్యూ కడుతున్నారు. అనిరుధ్ సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. రజనీకాంత్ నడుచుకుంటూ వస్తుంటే వెనుక వచ్చే నేపథ్య సంగీతం సరిగ్గా సరిపోయింది. కుటుంబ భావోద్వేగాలు, హీరోయిజంతో కూడిన కమర్షియల్ చిత్రమిది'' అని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంలో పాత్ర పోషించిన మైత్రీ మూవీ మేకర్స్ శశి గారికి, నాగార్జున గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటు, టికెట్ రేట్ల పెంపుపై వస్తున్న వార్తలను నాగవంశీ ఖండించారు. ప్రేక్షకులను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదన్నారు. ''కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీల వారీగా రేట్లలో వ్యత్యాసం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లోని థియేటర్లలో కేవలం రూ.50, రూ.70లకే టికెట్లు విక్రయించాం. భారీ బడ్జెట్ సినిమాలకు కొంత మేర ధరల పెంపు అనివార్యమైనప్పటికీ, ప్రేక్షకులకు భారం కాకుండా చూస్తున్నాం. ఈ దసరా పండుగకు కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లి సినిమాను చూడండి'' అని ప్రేక్షకులను ఆయన కోరారు.

## ప్రముఖ సంగీత దర్శకుడు దేవా కన్నుమూత



ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. తమిళనాడుకు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు దేవా (75) కన్నుమూశారు. గుండెపోటుతో చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ చిత్రాలకు దేవా పనిచేశారు. దాదాపు 400 సినిమాలకు స్వరాలు అందించిన దేవా.. తమిళ చిత్ర పరిశ్రమలో 'గానా' జానర్ పితామహుడిగా గుర్తింపు పొందారు. దేవా మరణవార్త విని పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. 1950లో చెన్నైలో జన్మించిన దేవా.. జె.బి. కృష్ణ శిక్షణలో శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. 1986లో వచ్చిన 'మాట్టుకర మన్నారు'తో ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు. తర్వాత పలు భాషల్లో వరుస సినిమాలకు స్వరాలు అందించారు. తెలుగులో 'శ్రీమాన్ బ్రహ్మచారి' సినిమాకు తొలిసారి సంగీతం అందించిన దేవా.. చిరంజీవి హీరోగా వచ్చిన 'మాస్టర్', పవన్ కల్యాణ్ 'తొలిప్రేమ'తో పాటు 'ఆటోడ్రైవర్', 'బాగున్నారా', ' నాగ' తదితర సినిమాలకు పనిచేశారు. రజనీకాంత్ నటించిన 'బాషా', 'అన్నామలై', 'అరుణాచలం' వంటి అనేక సూపర్ హిట్ చిత్రాలకు దేవా సంగీతం అందించారు. ఆయన కుమారుడు శ్రీకాంత్ దేవా కూడా సంగీత దర్శకుడిగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. ఇక, తమిళ నటుడు 'జై'.. దేవా మేనల్లుడే.

## ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే అతనే

ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే ఇకపై విజయ్ దేవరకొండ గురించే చెప్పుకుంటారని అన్నారు సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. విజయ్, రశ్మిక జంటగా నటించిన రణబాలి సినిమాను ఆయన వీక్షించారు. ఈ సినిమా చూసిన అనంతరం తన అనుభూతిని సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు సందీప్ రెడ్డి వంగా. రణబాలి సినిమాలో విజయ్ చేసిన యాక్షన్, ఫెరోషియస్ పర్ ఫార్మెన్స్ యూనిక్‌గా ఉందని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'విజయ్... నీ యాక్షన్, ఫెరోషియస్ పర్ ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది. స్క్రీన్ మీద నీ ఫైట్స్ చూస్తుంటే ఆ ఇంటెన్సిటీ ఫీల్ అయ్యాం. ఇకపై ఇండియన్ సినిమాలో యాక్షన్ హీరో అంటే నీ గురించే చెప్పుకుంటారు. కంగ్రాట్స్ విజయ్. ప్రేక్షకులు రణబాలి సినిమాను విజయ్ ఔట్ స్టాండింగ్ పర్ ఫార్మెన్స్ కోసం చూడాలి. రశ్మిక జయమ్మ పాత్రలో ఆకట్టుకుంది. ఆమె పాత్ర ఎంతో రియలిస్టిక్ ఫీల్‌ను కలిగించింది' అని చెప్పుకొచ్చారు.



## 'రణబాలి' చూసినవారికి ప్రేమతో హగ్స్

విజయ్ దేవరకొండ , రష్మిక దంపతులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రణబాలి'. రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. శింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ నటించగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక మెరిశారు. ఈ చిత్రంతోపాటు తన పాత్రకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందనపై రష్మిక భావోద్వేగానికి గురయ్యారు. తన ఆనందాన్ని పంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖను పోస్టు పెట్టారు. ''జయమ్మ..! ఆమె ప్రేమ ఎంతో స్వచ్ఛమైనది. ఓ మహిళగా ఉండటమంటే ఏంటో ఆమె నాకు నేర్పింది. తన ప్రజల కోసం నిలవడం, తనవారిని కాపాడుకోవడం, ప్రేమను పంచడం.. ఇదే నిజమైన స్త్రీత్వానికి అర్థమని తెలియపరిచింది. రణబాలి, జయమ్మలపై కురిపిస్తున్న ప్రేమను చూసి ఎంతో ఆనందం, ఉద్వేగం కలుగుతోంది. 'రణబాలి' మన సామాజిక శక్తిని, దేవుడిపై విశ్వాసాన్ని, సమష్టిగా పోరాడే స్ఫూర్తిని చాటిచెబుతుంది. థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఓ అద్భుతమైన అనుభూతి ఈ సినిమా. దర్శకుడు రాహుల్ కృషికి వస్తున్న ప్రశంసలు చూస్తుంటే సంతోషంగా ఉంది. విజయ్.. నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను. ఇప్పుడూ చెబుతున్నాను. నీ కష్టించే గుణానికి నేను అభిమానిని. నువ్వు ఎప్పుడూ కష్టపడి పనిచేస్తుంటావు. ఇప్పుడు నీ కష్టాన్ని అందరూ మెచ్చుకుంటుంటే, నాలో ఆనందం ఉప్పొంగుతోంది. మనసంతా ప్రశాంతతతో నిండిపోయింది. ఇప్పటికే ఈ సినిమాను చూసినవారికి గట్టిగా హగ్స్ ఇచ్చి నా ప్రేమను తెలియజేస్తున్నాను. ప్రేమతో, మీ జయమ్మ'' అని రష్మిక తన పోస్టులో పేర్కొన్నారు.



## ఎవరూ తప్పించుకోలేరు.. ఆ కంటెంట్‌ని వెంటనే తొలగించండి

బాలీవుడ్ నటి నేహ శర్మ ఏఐ మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా తన ముఖాన్ని వాడుతూ ఫేక్ వీడియోలు సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నెట్టింట ఇప్పటికే పోస్ట్ చేసిన అలాంటి అసభ్యకర కంటెంట్‌ను వెంటనే తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నేహ ఈ అంశంపై ఘాటుగా స్పందించారు. "నా అనుమతి లేకుండా నా ముఖాన్ని ఉపయోగించి ఏఐ వీడియోలు, ఇమేజ్‌లు క్రియేట్ చేస్తున్న వారిని తీవ్రంగా హెచ్చరిస్తున్నా. వెంటనే ఈ పనులు ఆపేయండి. నా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నా ముఖాన్ని వాడుకోవడాన్ని అస్సలు అంగీకరించను. ఎవరికీ ఈ అనుమతి ఇవ్వలేదు. ఇలాంటి మార్ఫింగ్ కంటెంట్‌ను క్రియేట్ చేసే వారితో పాటు వాటిని షేర్ చేసే వారిని కూడా వదిలిపెట్టను. ఇదొక సీరియస్ వార్నింగ్. దీని వెనుక ఉన్న ప్రతి ఒక్కరిపైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాను. ఫేక్ అకౌంట్ల వెనుక దాక్కున్నా సరే ఎవరూ తప్పించుకోలేరు. వెంటనే ఆ వీడియోలు డిలీట్ చేయండి" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక, ఇటీవల జాన్వీ కపూర్ డీప్‌ఫేక్ వీడియో నెట్టింట తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆ మార్ఫింగ్ వీడియోపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్ వల్ల తమ వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకునేందుకు పలువురు సినీ నటులు ఇప్పటికే కోర్టులను కూడా ఆశ్రయించిన విషయం తెలిసిందే.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com